:: శ్రీ అన్నమాచార్య సంకీర్తన - కార్యక్రమ ప్రారంభంలో ... :: (24.06.2020)

**01.** పల్లవి : చూడఁ జూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి !
యీడులేని కన్నులవె యినచంద్రులు !! !! చూడఁజూడ !!

**02.** చరణం : కంటిఁ గంటి వాఁడె వాఁడె ఘనమైన ముత్యాల- !
కంటమాల లవే పదకములు నవె !
మింటి పొడవైనట్టి మించుఁ గిరీటం బదె !
జంటల వెలుఁగు శంఖచక్రా లవె !! !! చూడఁజూడ !!

**03.** చరణం : మొక్కు మొక్కు వాఁడె వాఁడె ముందరనే వున్నాఁడు !
చెక్కులవే నగవుతో జిగిమో మదె !
పుక్కిట లోకము లవె భుజకీర్తులును నవె !
చక్కనమ్మ అలమేలు జవరాలదె !! !! చూడఁజూడ !!

**04.** చరణం : ముంగైమురాలును నవె మొల కఠారును నదె !
బంగారు నిగ్గులవన్నె పచ్చబట్టదె !
యింగిత మెరిఁగి వేంకటేశుఁడిదె కన్నులకు !
ముంగిటి నిధానమైన మూలభూత మదే !! !! చూడఁజూడ !!